
ముగింపులేని కథ
ఆచంట శారదాదేవి
PRABAKAR

వసంతం వేసవి. మధ్యాహ్నం పన్నెండు గంట లయింది. శంకరయ్య అప్పుడే భోజనంచేసి ఇంటి ముందు వరాండాలో కూర్చున్నాడు. ఇల్లు డాబా ఇల్లే, ముందు వరాండా మాత్రం రెల్లుతో కప్పారు. ఎదర కొబ్బరి చెట్లున్నాయి. చల్లగానే ఉంటుంది. అంత ఎండ తెలియదు. శంకరయ్య పడక కుర్చీలో కూచుని తమలపాకులు నములుతూ ఆనాటి తెనుగు పేపరు చదువుతున్నాడు. పేపరు చదవటం పొద్దునే అయిపోయింది. ఇప్పుడు చేస్తున్నది ఏమీతోచక పునశ్చరణ. నిద్రవచ్చేదాకా కాలక్షేపం.

శంకరయ్య స్కూలు టీచరు చేసి రిటైరు అయ్యాడు. రిటైరు అయి అప్పుడే రెండేళ్ళు అవుతోంది. ఆయనేమీ కూడబెట్టలేదు. సంసారం గురించి ఆయన ఎక్కువ పట్టించుకోలేదు. ఆయనకు ఏ దుర్వ్యసనాలూ లేవుగాని, చిన్నప్పటి నుంచి చీట్లపేకమీద మాత్రం ఎనలేని వ్యామోహం. అంచేత ఆయన జీవితమంతా బడి, పిల్లలు, చదువు, ఇంకా తీరిక దొరికినప్పుడల్లా ఎవరింటి వీధి అరుగుమీదైనా పేకాట కాలక్షేపం, అంత కన్నా ఆయనేమీ పట్టించుకోలేదు. ఆయన జీవితం అలా గడిచిపోయింది. పంతులుగారికి ముక్కోపం అన్న ప్రసిద్ధి మాత్రం తెచ్చుకున్నాడు. ఆ ముక్కోపం సంగతి బళ్ళో పిల్లలకన్నా ఇంట్లో ఆయన భార్య పార్వతమ్మకు ఎక్కువ తెలుసు. అయన తండ్రి ఆయనకు ఒక చిన్న డాబా ఇల్లు, రెండెకరాల మాగాణి మిగిల్చి ఇచ్చిపోయాడు. అంచేత ఉండడానికొక ఇల్లు, తినడానికి కాసిని గింజలు వీటికి కరువులేకుండా పోయింది.

శంకరయ్య భార్య పార్వతమ్మ వరాండా వెనకాల గది గుమ్మంలో గడపదగ్గర కూచుంది. ఆమె పక్కింట్లో అరువుతెచ్చిన పాత వారపత్రిక చదువుతోంది. ఆమె ఏ కథా పూర్తిగా చదవడం లేదు. ఊరికే పేజీలు తిప్పుతోంది. నిర్లిప్తంగా బొమ్మలు చూస్తోంది. ప్రతి పేజీక్రింద సశేషం సశేషం అని చదువుకుంటోంది. మనసు అక్కడ లేదు. ప్రతిరోజు మధ్యాహ్నంవేళ ఆవిడ తన గత జీవితం నెమరువేసుకుంటూ ఉంటుంది. అందులో సంతోషపడదగిన సంఘటనలేవీలేవు. అందుకే అది తరచు గుర్తుకు వస్తూఉంటుందేమో!

పార్వతమ్మకు పాతకాల పద్ధతులననుసరించి పదేళ్ళకే పెళ్ళయింది. పన్నెండేళ్ళకు కాపురానికి వచ్చింది! ఆ వయసునుంచి బండెడుచాకిరీ ఆమె వంతయింది. అదృష్టవశాత్తు బావలు, మరుదులు ఆడబడుచులు ఎవరూలేరు. శంకరయ్య ఒక్కడే కొడుకు. అయినా అందరి బదులు అత్తగారు మహాలక్ష్మమ్మగారు ఒక్కరుచాలు. పార్వతికి అత్తవారింట్లో అడుగుపెట్టినప్పటినుంచి మనశ్శాంతి లేకుండా పోయింది. పని పాటలేవీరావని కొన్నాళ్ళు, పుట్టింటివారు సారెలు ఘనంగా పెట్టలేదనికొన్నాళ్ళు, తమ కర్మకొద్దీ దొరికిందని కొన్నాళ్ళు, ఏదో ఒక రకంగా పార్వతమ్మను ఆమె బ్రతికి ఉన్నన్నాళ్ళు సాధిస్తూనే ఉంది. ఆ సాధింపులకు పార్వతి మొదట్లో ఏడ్చింది. తరువాత అలవాటు పడింది. మొండికెత్తింది. సాధింపులతో సగం జుట్టు నెరిసింది. శంకరయ్య ఎప్పుడూ ఏమీ పట్టించుకో లేదు. తనకు కావలసినవి సరిగా అమరనప్పుడు కసురుకోవడం తప్ప ఆమెను ఇంకేవిధంగానూ ఆదరించలేదు.

దురదృష్టవశాత్తు కాపురానికి వచ్చిన కొన్ని సంవత్సరాలదాకా పార్వతికి పిల్లలు పుట్టలేదు. అది అత్తగారికి సాధించటానికి మరివొక కారణమైంది. "మా ప్రాణానికి గొడ్రాలు దాపురించింది. మా వంశం ఇంక ఇంతటితో అంతరించాల్సిందే" అంటూ ఇరుగూ పొరుగూతో చెప్పి ఆడిపోసు కునేది. కొడుక్కి మళ్ళా పెళ్ళిచేస్తే బాగుండునని ఆలోచనలు చేసింది. నిజంగానే కొడుక్కి మళ్ళా పెళ్ళి చేస్తుందేమోనని పార్వతి దిగులుపడి ఏడ్చేది.

పాతికేళ్లు దాటాక పార్వతికి కొడుకు పుట్టాడు. అత్తవారింటి ఆనవాయితీ ప్రకారం ఒక్కడే కొడుకు, మళ్ళా సంతానం కలగలేదు. కొడుకు పుట్టిన తరువాత కొన్నాళ్ళకి అత్తగారు పోయింది. ఆ తరువాత మామగారు పోయారు. పార్వతి ఒంటరిదైంది. సంసార భారాన్నంతా నెత్తిన వేసుకుంది. శంకరయ్య ఇంటికి వచ్చినా రాక పోయినా అన్ని పనులు తనే చూచుకుని ఇల్లు చక్కదిద్దుకుంది.

శంకరయ్య ఇంటిని గురించి గాని కొడుకును గురించిగాని ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. పార్వతికి కొడుకును అదుపులో పెట్టటం చేతకాలేదు. వాడికి చదువు సంధ్య అబ్బలేదు. తండ్రి విద్య చీట్లపేక మాత్రమే అబ్బింది. ఆ ఊళ్ళో తండ్రి ఒక మూల చీట్లు ఆడుతూ ఉంటె వీడు ఇంకో మూల ఇంకో సందులో ఆడుతూ ఉండేవాడు. ఇద్దరూ ఇంచుమించుగా ఒకే టైముకు వెనకా ముందుగా కొంపకు చేరేవారు భోజనానికి, నిద్రకు.

శంకరయ్యకు తను చీట్లు ఆడటం తప్పుగా తోచలేదు. కొడుకు చదువు సంధ్యలేక చీట్లు ఆడుతూ చెడిపోతున్నాడని మాత్రం విపరీతమైన దుగ్ధ పట్టుకుంది. అది అంతా పార్వతి తప్పైనట్లే

## వినతి

'వనిత'కు కథలు, వ్యాసాలూ మొదలైనవి పంపేవారు గుర్తు పెట్టుకోవలసినవి కొన్ని ఉన్నాయి. ఏమిటంటే—కథలు మరీ పెద్దవి కాకుండా వుండాలి. తావుసైజు కాగితం మీద ఆరు, ఏడు పేజీల కధ అయితే బావుంటుంది. మరీ తప్పదనకుంటే - పది పేజీలకు మించకుండా వుండాలి. వ్యాసాలయితే అదే సైజు కాగితంలో రెండు పేజీలు. తప్పితే మరో అరపేజీవరకూ వున్నా పర్వాలేదు. పంపిన రచనతో తమ అడ్రసు గల కవరు జతచేస్తేనే, సమాధానం ఇవ్వడానికి సాధ్యం అవుతుంది. ప్రతి రచన మీదా, తమ పేరు, పూర్తి చిరునామా వుండాలి. అది తమ సొంత రచన అన్నట్టుగా విడి కాగితం మీద 'హామీ' కూడా రాసి, సంతకం చెయ్యాలి. ఇహ - పేజీకి ఒక పక్కనే రాయాలనీ, అదీ శుభ్రంగా, విడివిడిగా కలంతోనే రాయాలనీ వేరే రాయనవసరం లేదనుకుంటాము.


—వ. సం.

పార్వతి మీద విరుచుకు పడేవాడు. "నీ సుపుత్రుడికి అన్నీ నీ బుద్ధులే వచ్చాయి. ఎందుకూ పనికి రాడు." అని పార్వతిని తిడుతూ ఉండేవాడు. "వాడు మీకు మాత్రం సుపుత్రుడుకాదా? వాడి బాధ్యత మీ రెప్పుడైనా తీసుకున్నారా?" అని పార్వతికి ఎదురుప్రశ్న వెయ్యాలని ఉండేది. కాని దాని ప్రయోజనం ఏమిటో తెలుసు. ఇల్లెగిరి పొయ్యేటట్లు కేకలు, శాపనార్థాలు, ఆ పూటకు అందరికీ పస్తులు. అంచేత అన్ని నిందలూ భరిస్తూ నోరు మూసుకు ఊరుకునేది.

కొన్నాళ్ళకు ఆ సుపుత్రుడు చీట్ల పేకలో అప్పులు చేసి తండ్రికి భయపడి చెప్పకుండా ఇంట్లో నించి పరారి యైనాడు. శంకరయ్య దానికి కూడా పార్వతినే తిట్టి పోశాడు. ఆయన కోపానికి జడిసి పార్వతికి కొడుకు కోసం గట్టిగా ఏడవటానికి కూడా అవకాశం లేక పోయింది. ఆ కొడుకును తలుచుకుని రాత్రిం బవళ్ళు చాటు చాటుగా కంటతడి పెట్టుకుని కుమిలి పోయింది. ఏడ్చిఏడ్చి కొన్నాళ్ళకు కాస్త కోలుకుంది. ఆ కొడుకు వెళ్ళిపోవటం నెగవేసినట్లు ఇప్పటికీ గుండెల్లో దహిస్తోంది. ఆ కొడుకు వెళ్ళిపోయి పదేళ్ళు అయింది. అయినా ఇప్పటికీ శంకరయ్య "నీ సుపుత్రుడు" అంటూ దెప్పిపొడవడం మాత్రం మానలేదు.

తనకు ఏభై యేళ్ళుదాటినాయి. ఇంతవరకు భర్తనుంచి ఏనాడు ఎటువంటి ఆదరణా సానుభూతీ పొందలేదు. భయపడుతూ భయపడుతూ నోరు విప్పకుండా రోజులు గడపటం మాత్రమే నేర్చుకుంది. ఒక్కొక్కసారి పెళ్ళి అన్న నెపంతో అత్తవారికి తాను బానిసగా అమ్ముడు పోయినట్లని పిస్తుంది. మహిళా సంవత్సరం, మహిళా దశాబ్దం అని తరుచు వింటూ ఉంటుంది. తనజీవితానికి మాత్రం ఏవిధంగాను మార్పులేదు.

పార్వతి పాతపత్రిక క్రింద పడవేసి భర్తకేసి చూసింది, అతను పేపరు ముఖం మీద కప్పుకుని నిద్రపోతున్నాడు. పార్వతి గడప మీద తల పెట్టుకుని పడుకుంది. నిద్రపోయి లేచేటప్పటికి ప్రొద్దువాలుతుంది. ఒక రోజు గడచిపోతుంది. మళ్ళా ఇంకొరోజు వస్తుంది, మళ్ళా మామూలే. ఇది మారనిబాట. ఎప్పుడో మృత్యువు పిలుస్తుంది. అందాకా ముగింపులేని బాట. □



శ్రీమతి యమ్. స్వర్ణలత

వైఫ్ ఆఫ్ శ్రీ యమ్. జి. కె. మూర్తి బి. ఇ; బి–62 వివేక్ విహార్, షాద్రా, ఢిల్లీ 110032.

గృహిణి. 21 సం॥ల వయసు. పుస్తకాలు, రేడియో, సంగీతం, స్నేహితులు – అంటే ఇష్టం. కొత్త కొత్త వంటలు నేర్చుకోవడం, చెప్పడం – ఇష్టం. కొత్త విషయాలు తెలుసుకోడంలో ఉత్సాహం చూపుతారు.

శ్రీమతి బి. రాధిక

కేరాఫ్ బి. జయరామ కోటేశ్వరరావు ఎమ్. ఏ; కాంగ్రెస్ ఆఫీసు ఎదుట: మారీసుపేట; తెనాలి.

వయసు 26 సం.లు. గృహిణి. కలం స్నేహం చెయ్యడంలో ఉత్సాహం వున్నది. పుస్తకాలు చదవడం, మిషను మీద కుట్టుపని చెయ్యడం హాబీలు. మాంసాహార వంటకాలు బాగా చేస్తారు.

కుమారి ఆర్. కె. మీనారాణి బి. ఎ (లిట్)

డాటర్ ఆఫ్ శ్రీ ఆర్. కె. మాధవ్, అస్ట్రాలిజర్, గిరి గార్డెన్స్, మచిలీపట్టణం.

20 సం.లు వయసు. బాడ్మింటన్ మొదలైన ఆటల్లో ఉత్సాహం వున్నది. ఒకప్పుడు నాటకాల్లో కూడా నటించారు. స్టాంపులు, నాణాలు సేకరించడం ఇష్టం. చాలా నాణాలు సంపాయించారు. జ్యోతిషం, మాజిక్ చెయ్యడాలలో ప్రవేశంవున్నది. పెళ్ళి చేసుకొని విదేశాల్లో వుండాలన్న అభిలాష. చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, రైఫిల్ షూటింగ్‌లలో కూడా ప్రవేశం వున్నది.

శ్రీమతి యమ్. లక్ష్మి

నెం 160, పర్మనెంట్ హౌసింగ్ కాలనీ, శ్రీహరికోట – 524124. (నెల్లూరు జిల్లా)

వయసు 19 సం.లు. గృహిణి. ప్లాస్టిక్ వైరులతో రకరకాల సంచులు అల్లడం, కూరగాయల పెంపకం, ముగ్గులు సేకరించడం, పుస్తకాలు చదవడం–లలో ఉత్సాహం వున్నది.

శ్రీమతి నిష్టల పార్వతి

సి/10 అరకులోయ – 491153. (పాడేరు తాలూకా) విశాఖపట్నం జిల్లా.

గృహిణి. వయసు 35 సం.లు. చిత్రలేఖనం, ఫోటోగ్రఫీలంటే ఉత్సాహం. బట్టల మీద పెయింటింగ్స్ చెయ్యడం, ఎంబ్రాయిడరీలు చెయ్యడంలో ఆసక్తి. సభలు, సమావేశాలకు వెళ్ళడంలో మంచి ఉత్సాహం.

కుమారి డి. రాధాలక్ష్మి

వైఫ్ ఆఫ్ శ్రీ పి. రాఘవేంద్రరావు బి. కామ్; 'శ్రీనివాస్'; కోపల్లివారి వీధి, రామారావు పేట, కాకినాడ.

20 సం.లు వయసు. గృహిణి. టైప్ రైటింగ్, హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. తరచు దేవాలయాలకు వెళ్ళడం. దైవ దర్శనం చేసుకోడం ఇష్టం. ఫోటోలు తియ్యడం వచ్చును. పుస్తకాలు బాగా చదువుతారు.

శ్రీమతి పి. వి. రమణ

2-2–647/37 సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాదు-500013.

గృహిణి. 'స్కూల్ ఆఫ్ కరెస్పాండెన్స్ కోర్స్'లో విద్యార్థిని. 21 సం.లు వయసు. కళల మీద, కళాకారుల మీదా అభిమానం. విదేశాలలో వున్న వారితోనూ, పర రాష్ట్రాల వారితోనూ స్నేహాన్ని కాంక్షిస్తున్నారు. "స్నేహానికి, ఆడా మగా తేడాలేదు, ఎటొచ్చి మంచి మనసు వుండాలి" అంటారు. తోటపని, స్టాంపులసేకరణ, చిత్రలేఖనం–లలో ప్రవేశం వున్నది.

కుమారి కె. జయకుమారి

డాటర్ ఆఫ్ కె. ముత్యంరెడ్డి; కమల్‌టాకీస్ రోడ్, నిర్మల్, ఆదిలాబాదు.

విద్యార్థిని. 18 సం.లు వయసు. బి. యస్ సి చదువుతున్నారు. క్రీడారంగంలో ఆసక్తి ఎక్కువ. చాలా ఆటల్లో ప్రవేశం వున్నది. తోటపని, చిత్రలేఖనం-లలో ప్రవేశంవున్నది. సినిమాలు చూడడం అంటే ఏ మాత్రం ఇష్టపడరు! "స్నేహంలో ఆడ, మగ తేడాలు చూడను" అంటారు.